కథా నిలయం 3518 శ్రీకాకుళం

# దాగుడు మూతలు

'అమ్మ వాళ్ళింటికి వెళ్ళిపోయిందని నేనడిగిన దానికి జవాబు చెబుతూ మొహం తుడుచుకుందికి తువ్వాలు అందిస్తూ అంది లత. తుడుచుకున్న తర్వాత అనేక ఊహలు బుర్రలోకి రాగా ఆలోచిస్తూ 'యింకా ఆలస్యం ఎందుకు ? రా! రావూ!' అన్నట్టు లత వైపు చూశాను. కాని, ఒక్కమారు వీధి గుమ్మంవైపు కళ్ళు చక్రాల్లా తిప్పి తలవంచుకుంది. ఆ భావం గ్రహించినట్టు గభాలున వీధి తలుపు వెయ్యడానికి వీధిలోకి వెళ్లేను.

''ఏమే లతా ! ఏంచేస్తున్నావు ?'' అని పరామర్శిస్తూ వచ్చేస్తోంది రాక్షసి లాగ ప్రక్కయింటి సబ్బమ్మగారు! ఏదో పెద్దపని వున్నట్టు! వచ్చీ రావడంతోనే మంచం మీద సావకాశంగా చతికిలబడింది. నాకు ఒళ్ళంతా మండిపోయింది. గుడ్లగూబలా సమంగా ఎటువంటి సమయానికి వచ్చింది! అప్పుడు నాకెంత కోపం వచ్చిందంటే నిర్మొహమాటంగా 'వెళ్ళిపో మా అమ్మ యింట్లో లేదు' అని ఖచ్చితంగా చెప్పేద్దామనుకున్నానన్నమాట..గాని... ముందు రాబోయేది కొంచెం ఆలోచించి నోరు మూసుకొని వూరుకున్నాను. యిహ నెందుకూ అక్కడుండడం! ఆ భ్రభ్రాజిమానం ముఖం చూడ్డానికా ? అదీకాక అక్కడింకా వున్నానూ అంటే నోరు మంచిది కాదు. ఒకదానికొకటి ఏమొస్తుందో అని చల్లగా వీధి గదిలోకి వచ్చి మీసమేషాలు లెక్కపెడుతూ ఆలోచిస్తున్నాను. ఆవిడని చూడగానే నిరాశ పడిపోయి కూర్చుండిపోయేను.

ఇలా యిదొక్కమారేనా?... అయ్యో! అదేం ఖర్మమో బుద్ధి పుట్టించిన ఆ భగవంతుడు అది నెరవేరేటట్టూ కూడా చెయ్యడు! చూడడు!! ఒక దఫా యిలాగే -

నాకు పెళ్ళయిన తర్వాత మా ఇంటికి లత రావడం అదే తొలిసారి. ఆ బుద్ధి యింతకు ముందెప్పుడూ పుట్టలేదు గాని అదేవిఁటో గాని అప్పుడు లతని చూసిన దగ్గర నుండి అదోలా అనిపిస్తుంది! అప్పట్లో నా అలికిడి అయేసరికి తుర్రుమని పారిపోయేది. ఆ పారిపోతున్నప్పుడు వదిలిన బాణంలాగు త్రుటిలో కనిపించి అవుపించేది కాదు! ఆ లీల చూసే ''ఓహో! హో!' అని అనుకొనేవాడిని. అటువంటి పరిస్థితుల్లో ఆమెతో మాట్లాడ్డం కూడానా ? ఇప్పటికే లెఖ్ఖకు దాటిపోలేదు! నక్షత్రాలు, అలా మిడుతూ మిడుతూ చంద్రుణ్ణి చూసి, చూస్తూ ఆనందిడమేగాని స్వతంత్రించి కౌగిలించుకో గలవా ? చీకటి రాత్రుల్లో చంద్రుడు అన్ని నక్షత్రాల్లోనూ అన్ని భాగాలుగా లీనమయి పోతాడు కామోసు? లేకపోతే చంద్రుడు లేకపోయినా అవి ఎందుకలా మెరుస్తున్నాయి?

కొన్నాళ్ళకి ఎలాగయితేనేం మామధ్య మన్మధుడు ప్రవేశించి అటునుంచి - యిటూ యిటునుంచి- అటూ... కొన్ని గులాబీ పువ్వుల బాణాలూ, మరికొన్ని మల్లెపువ్వుల బాణాలూ, యింకా కొన్ని

సంపెంగపువ్వులవి, యిలాంటి విలువయిన బాణాలే వదలడం మొదలెట్టేడు. నా పక్కనుండి వెళ్ళినవి చామంతి, సన్నజాజి, బాణాలయితే ఆమె నుండి వచ్చినవి దవనం, మరువం, బాణాలు!

ఒకనాడు, మా అమ్మ ఏదో పని వుండి ఎవరింటికో వెళ్ళ వలసి వచ్చింది. మరెవ్వరూ లేరు. నేనూ, లతా ఒంటరిగా యిద్దరం తటస్థపడడం అదే మొట్ట మొదటి పర్యాయం. ఆ సమయంలో నాకు మతి పోయింది. ఏం చెయ్యడానికీ తోచలేదు! నా సర్వస్వం... ఎక్కడో మంధర పర్వత మధన ప్రదేశంలో దేవతలు అమృతాన్ని దొంగతనంగా తాగుతున్నట్టు అనిపించింది. అక్కడ నా కపుడు విషజ్వాలలు కనబడలేదు. అమృత ధారల్లో స్నానం చేస్తున్నానంతే. కల్పవృక్షం కింద కూర్చున్నా. చంద్రుడు వచ్చి, కాస్త వెన్నెలని కామధేను పాలతో కలిపి యిచ్చేడు. త్రాగేసి జిర్రుని తేన్చేను. లక్ష్మీదేవి విష్ణుమూర్తి కోసం కాబోలు వెతుక్కుంటోంది!

అలా లత వయిపు చూస్తూ కూర్చున్నాను. లత పెరట్లో కాఫీ కలుపుతున్నది. స్వంత పెళ్ళాం దగ్గర అంత జడుపు దేనికో నాకే బోధపడిందికాదు! ఎంత గుత్తయినా కొత్త కదూ ? అందుకే తటపటాయించి ఆలోచించవలసివచ్చింది! అప్పుడు నా స్థితి ఎలా వుందో వర్ణించలేను. ఆఖరికి తెగించేశాను.

మెల్లిగా పెరట్లోకి వెళ్లేను! నన్ను చూసి - ఆ చుట్టుపక్కల దొబూచులాడే చోట్లు లేవు కాబట్టి అలాగే లేచి గోడకి ఆనుకొని నిలుచుంది నా లత. వీధి తలుపు తాళపు చెవి కన్నంలోంచి చూస్తే కనబడకుండా యీ పెరటి తలుపు చేరవేశాను. కమల అది చూసిందో లేదో! ఏం మాటాడలేదు. నేను చొరవ చేసి ఆమె చెయ్యి పట్టుకున్నాను! కొంచెం బెట్టు సరిచేస్తున్నట్టు ఆ చెయ్యి బరువుగానే వచ్చింది. నాకూ కొత్త! ఆమెకూ కొత్త! ఆమె చెయ్యి కొంచెం వణికింది, వణకడమో మరేవిట్లోగాని నాకు మాత్రం ఎలక్ట్రిక్ కరెంటు షాక్ లాగ లాగింది! జల్లుమంది. సరి! వీధి తలుపు చప్పుడూ. దానితో సహా 'ఏమండీ!' అన్న పిలుపూను. యిహ నెలా ఉరెట్టుకోవడం? వెన్నెల రాత్రి వస్తూందీ అన్న ముందు రోజుల్లో రాలిపోయిన 'తార' లా అయింది. ఆమె చెయ్యి గభాలున లాగేసుకుంది! నేను ఆ తొందరలో కాఫీ గిన్నెని తన్నేసి గదిలోకి ఒక్క దాటు వేసేను!

లత తలుపు తీసింది. వచ్చింది ఎవరు ? ఆ వీధిలోనే వున్న మరొక అమ్మాయి. ఎందుకు వచ్చిందీ అంటే - జాకెట్టు కత్తిరింపులూ, కుట్టడం నేర్చుకుందికి! పాపం! మా అమ్మకూడా వుంటుంది కదా అని వచ్చింది. వచ్చి నన్నూ, దాన్ని, ఒంటరిగా చూసి - వాసన పసిగట్టి, కొంచెం, విచక్షణా జ్ఞానం, పాపం, పుణ్యం ఎరుగున్నది కాబోలును- ''మీ అత్తగారు లేరు! మళ్ళీ వస్తాను!'' అని లేవబోయింది! కాని లత వెళ్ళనివ్వలేదు! నాకున్న తొందర యీమెకు లేదేం చెప్మా! ఏ వయస్సులో వున్న వాళ్ల మనస్తత్వం, వాళ్ళ భావాలూ, అభిప్రాయాలూ, అదే వయస్సులో వున్న పై వాళ్ళకు కూడా సులభంగా అర్థమవుతాయి. సమాన వయస్కులు ఒకళ్ళ నొకళ్ళు అర్థం చేసుకున్నట్టు భిన్నవయస్కులు అర్థం చేసుకోలేరు. స్నేహం విషయంలో కూడా పిల్లలు, పిల్లలతోనే - యువకులు యువకులతోనే, పెద్దలు పెద్దలతోనే, వృద్ధులు వృద్ధులతోనే ఎక్కువగా స్నేహంగా వుండడం చూస్తాము గాని, భిన్న వయస్కుల మధ్య స్నేహం తరుచూ పొసగదు. పొసిగినా నిత్యం కాదు! మరి యీ

అమ్మాయికీ, ఆ సుబ్బమ్మకీ భేదం యిదే!

మొత్తం మీద యీ పుణ్యకాలం కూడా యిలా వెడింది! ఇలా ఏదో మంచి సమయం దొరకడం తీరా ఏ పాపపు గ్రహంలో వచ్చి పాడు చెయ్యడం! లేకపోతే యిప్పుడేం కొంపమునిగింది. ఆ సుబ్బమ్మ వాళ్ళ మీద వీళ్ళ మీద ఆడిపోసుకుంటూ తా చెడ్డ కోతి వనమెల్లా చెరిచిందన్నట్టు పై వాళ్ళని కూడా పాడు చెయ్యడానికి వచ్చి కూర్చోకపోతే! సమంగా ఎరుగున్నట్టు పస్తారు నుంచి రిహార్సలు చేశాక! ముఖం ముందు తకీమని చెప్పేయడానికి దమ్ము చాలదు! అలా చెబితే యింకేమయినా వుందా? ప్రసార ప్రవాహాలు బయలుదేరవూ? అంతే! అలా లోలోపునే పొంగే కోరికలని బలవంతాన్ని అణుచుకుంటూ ఏడవవలసిందే!

వివాహం శుభముహూర్తాన్ని ఎలాగూ చేశారు! యిహ అదొక్కటే తరువాయి! దానికయినా నేను 'ఊఁ' అంటే అభ్యంతరముండేది కాదుగాని ''చదువయితేనేగాని'' అన్న అడ్డునా అంతట నేనే వెర్రి వెంగళాయిలా పెట్టుకొని టెక్కు చేశాను. ఇప్పుడది కాదని ఎలా యీ విషయం చెప్పడం? మరో ఉపాయం ఆలోచించాలి! అదీ అపాయం లేని ఉపాయం అయితే ఉభయత్రా మంచిది. యింతకీ అధికారం ఉన్న చోట అపాయం వచ్చినా ఫర్వాలేదు! ఏది ఏమయినప్పటికీ - ఈ కలాపాన్ని పూర్వం నుంచీ కవులు, ఒక్క కవులేమిటి అనుభవ యోగ్యులందరూ ఎంతలాగో వర్ణిస్తారు... వర్ణిస్తూ నిమీలిత నేత్రులౌతారు. అవుతూ, పరవశత్వం పొందుతారు. పొందుతూ వేడి వేడి నిట్టూర్పులు విడుస్తారు. ఏమో తాము చూసింది స్వర్గలోకమని మననీ చూడమంటారు! తినబోయేది రుచిచూస్తేనేగాని తృప్తిలేనట్టు అదేమిటో యీ లోగానే అనుభవిద్దామంటే... విస్తట్లో బొట్లులాగ సమయం దొరికే టప్పటికి వీళ్ళొకళ్ళు తగులుకుంటున్నారు! మాటిమాటికి!

ఇలా ఆలోచిస్తూంటే లత సంగతి అప్పటి పరిస్థితి జ్ఞాపకం వచ్చింది. ఆ సుబ్బమ్మ ఎప్పటికయినా పైకి వస్తుందేమో అని కూర్చుంటే అప్పుడనగా వెళ్లిన మనిషి ఓ ఘంట అయింది గాని యింకా ఊడి రాలేదు. చిక్కిన సమయం అలా వృధా పోతూంటే నాకెంతో యిది అనిపించింది. పిల్లి పారపోసిన పాల లాగయింది. ఆ పాలు పిల్లికీ దక్కవు. మనకూ దక్కవు! మెల్లిగా తలుపు తోసి చూసాను... యింకేముంది! ఆవిడ హాయిగా నిద్రపోతూంది! దీని నిద్ర తగలెడా, పోయి వాళ్ళించో ఏడవరాదూ? లత అల్లుకుంటూ ఆ ప్రక్కన కూర్చుంది. చూసి చూడనట్టు యిటు వయిపు చూస్తూంది. నాకు భరించలేనంత కోపం వచ్చింది. అసలు ఆవిడ వుద్దేశ్యం ఏమిటి? ప్రత్యేకంగా పడుక్కుందికి యిక్కడికే రావాలా? ఏదో సామెత చెప్పినట్టు - మా యింట్లో వాళ్లే చూసీ చూడనట్టు వదిలేస్తూంటే మధ్య యీ పైవాళ్ళ బాధ ఏమిటి? అయినా ఆవిడ బుర్రలో ఆ పాటి జ్ఞానం వుండొద్దూ- ఎవరూ లేరు పాపం ఏదో అవస్థ పడుతున్నారనేనా ఆలోచించనక్కరలేదా? యీ రకం మనుష్యులకి ఎడబాటు కలిగించడం అంటే ఆనందమేమో! తలుపు గడియ చప్పుడు చేసేటప్పటికి లత ఇటువయిపు చూసింది. ''దాన్నెలాగయినా దారిబట్టే తోవ చూడు'' అన్నట్టు నేను సంజ్ఞ చేశాను. ఒకమారు నవ్వి వూరుకుంది. అదేం తత్వమో మరి!

ఆ సుబ్బమ్మ రాకనేపోవాలిగాని వచ్చిందంటే మూడు నాలుగు ఘంటలయితేనేగాని వెళ్లదు.

అంతవరకూ ఎవరికీ ఎందుకూ పనికిరాని బాతాఖానీ కొడుతుంది. అన్నిటికీ ఊఁ! కొట్టేస్తేనే సరిగాని లేకపోతే ఎలాగోలాగ ఒప్పించే వరకూ వదలదు. ఇంతలో -

''అబ్బబ్బ! తాళాలు వేసుకు వెళి పోతుంది! ఊరుమీదకి తిరగడానికి! కొంపలో మరెవరూ లేరనుకుంది కామోసు. ఎలా చావమంటుందో యివతల వాళ్ళని'' అంటూ సుబ్బమ్మగారి ఆడబొట్టె గబగబా వచ్చింది.

''సుబ్బమ్మ వుందిరా ?'' అని మహా చనువుగా అడిగింది. ఆమెని చూడగానే ప్రాణం స్థాయిలోకి వచ్చి కుదుట బడింది! నా పాలిటి భాగ్యదేవతలాగ ఒక్క నిముషం కనిపించింది.

''ఆహా! వున్నది! కాస్త పట్టు ఎక్కువయింది కాబోలు హాయిగా చీకూ చింతా లేకుండా నిద్రపోతూంది! అయినా తాళాలు దగ్గరుంచుకొని చెప్పకుండా చెయ్యకుండా సత్రపు భోజనం మఠం నిద్ర అన్నట్టు ఎక్కడో పడుక్కుందికి పోతే ఎలాగవుతుంది ? పనులవొద్దా? వెళ్లి లేపండి. మరి యింట్లో నాలుగు పనులూ చేసుకోకపోతే అన్నీ మీరొకరు చూసుకోగలరా?'' అని ఏదో అభిమానం వున్నట్టు చెప్పేను. ఆ తర్వాత ఆవిడ ధర్మమా అంటూ ఆమె వెనకాలే సుబ్బమ్మగారు కూడా ఆవలించుకుంటూ, ఒళ్లు విరుచుకుంటూ వెళ్ళిపోయింది.

లత ఒక్కర్తే వున్నట్టే వీధిలో ఎవరి దృష్టీపడకుండా చూసుకొని గబుక్కుని లోపలికి పోయి తలుపు వేశాను. అదేమోకాని కొంచెం కాళ్లు చేతులూ వొణికేయి. లత నన్ను చూసి పల్లెవాటు సర్దుకుంది. వేరె పక్కకి తిరిగి నిలుచుంది. దగ్గరగా నే వెళ్లేనుగాని ఏమనాలో తెలియక తబ్బిబ్బు పడ్డాను! కొంచెం మరుగ్గా వుంటే ఎందుకయినా మంచిదని అక్కడయినా ధైర్యం వస్తుందేమోనని మాటాడకుండా నట్టింటిలోకి వెళ్ళి నిలుచున్నాను. ఆమెకోసం ఎదురు చూశాను. నా తెలివి తక్కువగాని ఆడపిల్లలంత వేగిరం కలుగజేసుకుంటారా ? ఎంతకీ రాలేదు లత! అంత ఆతృతలోనీ, నిరీక్షణలో నిరాశ పుట్టగానే విసుగెత్త నారంభించింది. తెగించి పిలుద్దామని యివతల చూశాను. లత ఎక్కడా కనిపించలేదు. యిందాకల నిలబడ్డచోటు కూడా ఖాళీగా వుంది. వాకిట్లో సూర్యకాంతం పువ్వులు తమ వద్దకి రాకండా మీద మీదనే ఎగురుతున్న తుమ్మెదవైపు జాలిగా చూస్తూ అది ఎటు తిరిగితే యివీ అటే వంగుతూ రమ్మని పిలుస్తున్నట్టున్నాయి.

గదిలో గాజుల చప్పుడు అయింది. అదొక సందేశం. ఇదంతా సిగ్గే కామోసు అనుకొని గదిలోకి వెళ్ళి చూశాను. తలుపు ప్రక్కనే సిగ్గుతో గోడకి తల ఆనించి నిలుచుని సన్న సన్నంగా, దొంగ దొంగగా చూస్తోంది తలుపు సందులోంచి.

'లతా!' అని పిల్చాను. ఒక్కమారు అదోలా చూసి ప్రక్కకి తిరిగిపోయింది. చెయ్యి మెల్లిగా పట్టుకొని దగ్గరకి తీసుకున్నాను. అప్పుడు సరస్వతి ధ్వనించే వీణ చేత్తో తాకుతున్నట్టయింది. వెంటనే ఆమె చెయ్యి విదుల్చు కుంటూ 'వద్దు... ఎవరయినా... వస్తారు!' అని అన్నపుడు అతీతమయిన ధ్వనులు, అపూర్వమయిన స్వరాలూ, ఆనందమయిన రాగములూ కూర్చి వీణ మీద అలా అలా... వినిపించినట్టయింది. నేనా పరవశత్వంలోనే పూర్తిగా వశం చేసుకుందికి ప్రయత్నిస్తూ -

'గడియ వేసే వచ్చాను లే!' అని అన్నాను. ఆమెను దగ్గరగా తీసుకోబోయేను. తలుపు

తప్పుడయింది......

లత బెదిరిపోయింది. ప్రశ్నార్థకంగా భయంతో చూసి విడిపించుకు పారిపోయింది. మెట్టు మెట్టుకీ విఘ్నాలేమిటా భగవంతుడా ? అనుకున్నాను. ఎవరయినా లోపలికి వస్తే వాళ్ళని అలా వెళ్లనిచ్చి పడీ చప్పుడూ లేకుండా తప్పుకోవచ్చునని, ధాన్యం బస్తాల వెనక కుక్కిన పేనులా కూర్చున్నాను. మరొక అవకాశమూ, ఉపాయమూ, గత్యంతరమూ లేక, అవస్థకొద్దీ విధిలేక దొంగతనానికి నెట్టుకోవలసి వస్తుంది. మళ్ళీ మబ్బుమొగ్గగాని వచ్చిందంటే సాయంత్రం మా అమ్మ వచ్చేవరకూ కదలడు! అక్కడనుండి మా అమ్మ అనుమానిస్తుంది! ఏమను కుంటుందో? లేకపోతే మా అమ్మే వచ్చేసిందా ? ఏమిటి ? - దాటుమాటుగా ఏం చేసినా ఫర్వాలేదుగాని ఒక్కసారి అనుమానానికి అవకాశం యిచ్చేమా అంటే మరి యీ స్వతంత్రమూ వుండదు. ఒక కన్ను యిటు పారేసి ఖాయిదా కాస్తే యిలా విషయం లభ్యం కాదు ! ఏం దారి, యిలా ఆలోచిస్తూంటే బస్తాలన్నీ ఒక్కసారుగా నామీద విరగబడ్డట్టు అయింది. లత లో (బుసాటుతో, తల, పరికిణీ, వల్లెవాటూ, అన్నీ సర్దుకొని తలుపు తీసింది. ఆ తర్వాత ఎవరితోనో మాటాడుతున్నట్టు వినిపించింది. నేననుకున్న వారెవరూ కాదని ఆ వాతవరణం బట్టి నిర్ధారణ చేసుకొని స్థిమిత పడ్డాను. మరో పది నిమిషాలకి తలుపు వేసి లత వస్తూంది. గదిలోకి రాలేదు ! నేనే లేచి వెళ్ళి చూశాను. ఆమె నవ్వుతున్నట్టుంది.

'ఎవరు?' అని అడిగాను.

'ప్రక్కయింటి నారాయణమ్మ గారు. ఆవాలు బదులిమ్మని వచ్చింది !' అని చెప్పింది! అప్పటికి నా గుండెల్లో గాభరా తగ్గింది. లతని గదిలోకి తీసుకు వచ్చేను. నాలో మరొక మహత్తరమైన శక్తి వచ్చి కలుస్తున్నట్టయింది గాని వేరొక మనిషి నన్నంటి పెట్టుగున్నట్టు లేదు. దోసిట్లో పుష్పం లాగ మృదువుగా ముడుచుకుపోయింది సిగ్గుతో! 'లతా !' అని సంబోధించేను. వంచిన తలమీది కెత్తుతూ.

- ఏం జవాబు చెప్పలేదు. కిందకి చూస్తూండడం వల్ల కనుబొమ్మలూ, రెప్పలూ మాత్రం కనబడుతున్నాయి. ఆ కనుబొమ్మలు రెండూ ఎక్కుబెట్టిన వింటి బద్దలలాగూ, కంటి రెప్పలు రెండూ, నారిలాగూ అవుపిస్తున్నాయి.

''నే జ్ఞాపకం వున్నానా ?'' అని అడిగేను.

''... చిన్న నవ్వు నవ్వింది అంతే.

'' నా దగ్గర యింత సిగ్గెందుకూ ? '' అనగానే ఆమె మరీ సిగ్గుపడిపోయింది.

''అయితే మాటాడవన్నమాట ! '' అన్న పిమ్మట -

''ఏమిటి మాటాడేది?'' అని పెదిమలు కదిలేయా లేదా అన్నట్టు కొత్తగా మాటలు నేర్చిన రామచిలకలా అంది.

''నీ కిష్టమయింది'' అని నే చోయిస్ యిచ్చేను.

''అడగండి''

''బాగుంది నీకే దిష్టమో నాకెలా తెలుస్తుంది !''

'' మీ కేది యిష్టమయితే అదే నాకూ యిష్టం '' అన్నది నవ్వుతూ. అక్కడికి బిడియం కొంతవరకూ సడలింది.

'' అయితే మనం చిన్నపుడేం చేశామో చెప్పు! '' అని అడిగేను.

''నాకు తెలీదు మీరే చెప్పండి''

'' ఏం జ్ఞాపకం లేవా ?''

''అన్నిటి మాట ఏమోగాని... అవి మరిచిపోతానా..''

అంటూ నా చిటికిన వ్రేలు పట్టుకుంది. అప్పటిచేష్టలింకా జ్ఞాపకం వున్నాయన్నట్టు నిద్యుసంగా, చిన్నతనంలో, యింకా పెళ్ళి కాక ముందు. మా యిద్దరిని, మొగుడూ పెళ్లాలని అందరూ, ఆడించడం .ఎవరూ చూడకుండా మేం.నవ్వుకుంటూండడం, యివన్నీ . జ్ఞాపకానికి వచ్చేయి.

''ఇంకా ఏం చేశాం'' అని తిరిగి అడిగేను.

'' మరేం చెయ్యలేదు, ... నాకు తెలీదు! '' అంది.

''పోనీ నువ్వు మీ ఊళ్ళో నన్నెప్పుడయినా తలుచుగుంటావా ?'' అని అడిగేను.

'' ఊఁహు... మీరో !'' అంది.

'' నన్ను చూస్తే తెలయడంలేదూ !''

''మరి నేనలా అవుపించడం లేదేఁవిటి ?'' అని నవ్వుతూ అంది.

''నిన్ను చూస్తే నీ విషయం తెలుస్తూంది గాని నన్ను తలుచుకుంటే ఎలా వుంటుందో చెప్పు!'' అని అడగ్గానే - వేళ్లతో జుత్తు తణివి ఏదో భావం చెప్పినట్టు చూసింది.

''నాకెలా వుంటుందో నీకు అలాగే అనేనా ? అంతేనా ?'' అని అన్నాను ఆమె అలాగే చెబుతుందని తెలిసి.

'' ఊఁహుఁ కాదు! మీకెలాగూ వుండదని నాకు తెలుసు!''

'' అదేఁవిటి అలా అంటున్నావు ?''

'' ఏమో మీ కేవిఁటినేను కాకపోతే మరొకరు!''

''అలాగా - మరి నీకు మాత్రం మరొకరు దొరకరా ఏమిటి ?'' అని నేననగానే ఆమె చేత్తో నా నోరు మూసింది.

''ఏం నేను పెళ్ళాడక పోతేనేం?''

''...... ఏం మాటాడలేదు గాని ఒక నిట్టూర్పు మాత్రం విడిచింది.

''ఏం?'' అని మళ్ళీ అడిగేను.

''అబ్బే ఏఁవీ లేదు... నాకేం?'' అని అంది గాని మనసులో వున్నది వేరు.

'' పెళ్లి అయిపోయింది కాబట్టిగాని లేకపోతే ఏం చేద్దువు ?''

''ఎందుకనదు?''

''ఎంత నమ్మకం! '' ఏమో ఎవరు చెప్పగలరు నువ్వు నా కోసమే అని భగవంతుడు దస్తావేజు రాసిచ్చేడా ?''

''అవును. దేవుడే నిర్ణయిస్తాడు. ...'' అని మరికొంతసేపు ఆగి -

''అవును లెండి. మీరడిగిన వివ్వకపోతే చేసుకొనే వారే కారు గదా! ఎవరిస్తే వారే మీకు కావాలి!''

''ఛా! పోని అలాగే ఒకవేళ అయిందనుకో అప్పుడు నువ్వు మాత్రం ఏం చేస్తావు? అలాగే వుండిపోతావా''

''అంతవరకూ వుంటే కదూ?''

''- అంటే''

''ఏదో లెండి. అలాంటి మాటలిప్పుడెందుకు?'' అంటూ తుసుక్కు పడింది.

''ఏం?'' అని అడిగేను.

''మీ అమ్మ వచ్చేరనుకున్నా చప్పుడయితే!'' అని అంది.

''ఓస్. ఎందుకంత భయం. ఏ చప్పుడూ అవందే.''

''మీ అమ్మవస్తే ఎలా.. వద్దు... వెళ్ళిపొండి... బావుండదు.''

'' యింకా రాదులే. ఫర్వాలేదు!''

అంటూనే లతని యింకా దగ్గరకి తీసుకున్నాను. మళ్ళీ తలుపు చప్పుడయింది-

లత కంగారుతో ''ఎవరూ?'' అని అడిగింది.

''నేనమ్మా! అమ్మగారు నేరూ?'' అంటూ బంగారి అవతల నుండి అరిచింది.

''అదెందుకు పొమ్మను!'' అన్నాను.

''అమ్మయ్యో! లేదండి యిల్లు కడగడానికి వచ్చింది!''

'' అన్నీ యిప్పుడే ముంచుకొస్తాయి! యిప్పుడేం కొంప మునిగిపోయింది! రేపు రమ్మను!''

'' మీ అమ్మ మరీ మరీ చెప్పేరు. వస్తే కడిగించమని. రేపు పండుగ కదూ? అది మీ అమ్మతో చెబితే-''

''చచ్చాం ముహూర్తం ఏంవీ బాగు లేనట్టుంది. అయితే ఏం చెయ్యడం? ''

''మీరలా పెరట్లోంచి వెళ్లిపొండి. ఏం చేస్తాం? యింకా వుంటే బావుండదు'' అని భుజం తట్టి అడిగింది.

''అది కాదు - ఆ చీడీ వీధి సావిడి కడిగి పొమ్మను. అంతా కడిగిందని చెప్పొచ్చు వేగిరం రా!''

''అయితే మీరు వెళ్ళరూ?''

'' అహం. యిక్కడే వుంటా భయం లేదు. వెళ్ళు పారిపోవడం దేనికి? నేనేం దొంగనా? మా అమ్మ లేకపోతే యింటికి నేను రానా? రాకూడదని రాసి వుందా? ఏదో పని వుండి వచ్చేం! అంతే -''

''అనుమాన పడరూ?''

''పడదులే. వెళ్ళు -''

''వద్దండి. తెలిసిపోతుంది! నా మాట వినండి. యింకెలాగూ మీ అమ్మ వచ్చేస్తారు!'' అంది.

''వెళుదూ చెబుతాను'' అని నేనన్న మీదట లత మాటాడకుండా వెళ్ళి తలుపు తీసింది. వాళ్ళ

మాటలు వింటూనే వున్నాను.

''అమ్మా! బాల్చీ ఏదమ్మా నీరు తోడుకోవాలి.'' అని బంగారి అడిగింది.

''అన్నా! అది యిందాకల తోడుతూంటే నూతులో పడిపోయిందే ఎలాగ?'' అని అంది.

''గేలం ఎక్కడున్నా వుంటే తేరాదూ?'' అని తిరిగి అంది.

''ఈ యిల్లు కాడెక్కడా నేదమ్మా. ఎక్కడో ఎతికి తేవాల యింత బేగి అవుద్దా!'' అని అంది. దాని ధర్మమా అని గేలం కోసం పరుగెట్టక ''ఆ గోలెంలో నీళ్ళు ఎంతవరకూ వస్తే అంతవరకూ కడిగి వెళ్ళిపో'' అని చెప్పింది. ఎంత పని చేసింది! ఒక్క ముక్కలో యిదంతా తప్పించి ఆఖర్న వదిలేసింది. ఏదో కారణం చెప్పి దాన్ని దారి బెడితే ఎంత బావుండేది! ఏ నిముషాన్ని ఎవరు వస్తారో? ఏం రసాభాస చేస్తారో? అంతలో మా అమ్మే వస్తుందో ఏంవిటో. అని దిగులుతోనే వున్నాను.

ఒక అరఘుంట పోయాక లత వచ్చింది.

''ఇహ అలికిరి చెయ్యొచ్చు. పిల్లిని తోలేసేను! పాపం వూపిరయినా గట్టిగా తియ్యకుండా కూర్చున్నారు!'' అంది చమత్కారంగాను.

''ఎర దొరికితేనే అలికిరి చేస్తాను! నేనే దొంగ ననుకుంటే నా కన్నా దొంగవయిపోయేవే?'' అని అడిగేను.

''ఏం. నేనేం దొంగపని చేశానిప్పుడు?''

''నేనంతా వింటూనే వున్నాను. నువ్వు దాంతో అబద్ధం చెప్పలేదూ?''

''ఏంవని చెప్పేనో?''

''ఏమో. అమ్మ వస్తే తెలిసిపోదూ! ఏవని తప్పుకుంటావో చూడనా? బాల్చీ అక్కడే వుంటే దాని దగ్గర చెప్పేసినట్టేనా?''

''నేను నిజంవే చెప్పేను. నాకేం భయం?'' అంది ధీమాగా.

''అదేంవిటి యిప్పుడిపుడు నేను చూశాను నూతి దగ్గర చేదని, యింతలో ఎవరు పడేశారు. యిదంతా నాటకంలా వుంది. మాయలు కూడా వచ్చునన్నమాట.!'' అన్నాను ఆశ్చర్యంగా.

''లేదండీ. బంగారితో అలా చెప్పిన తర్వాత అది వెళ్ళగానే నేనే కోరుండి బాల్చీని నూతులో ఎత్తేశాను. లేకపోతే ఏమంటారో అని'' అని తల వంచుకొని సిగ్గుతో చిన్నబోయినట్టు అంది.

నాకు నవ్వొచ్చింది. మొత్తం మీద మంచి ఉపాయమే తోచింది. ఒక తప్పుకి మరో పొరపాటు. కాని- పని కొచ్చిన పొరపాట్లయితే ఎన్ని అయినా బాధ లేదులే!'' అన్నాను.

''మీ నుంచే కదూ?'' అంది.

''అబ్బ! ఏం త్యాగం? స్వలాభం ఏంవీ లేదు కదూ...'' అని అంటూ దగ్గరగా తీసుకున్నాను.

''ఏం నీ కిష్టం లేదూ?'' అని అడుగుతూ అసింటా అసింటా జరిగిపోతున్న లతని పట్టుకున్నాను.

ఒకమారు నా మొహం మాటాడకుండా చూసి తల దించుకొంది. ఆమెని యింకా దగ్గరగా తీసుకున్నాను.

''నీకెందుకు ఆ భయం ?'' అన్నాను.

''అంత వరకూ తొందరెందుకూ ?'' అని అడిగింది.

''ఎంత వరకూ ?''

''మీకు తెలియనట్లు !''

''ఓ అదా ! కార్యం కదూ !''

''ఛీ'' సిగ్గుతో తల వాల్చి నా వేపు ఒక్కసారి అదోలా చూసింది.

''అంత యిదయితే పట్టని ఎందుకన్నారు?'' అంది.

''తొందరేం ?'' అన్నాను.

''అయితే అంతవరకూ నా వూసు ఎందుకెత్తుతారు ? తొందరేం ?'' అని ఎదురు ప్రశ్న వేసింది.

''అబ్బా పెద్ద పిచ్చి !'' అని అనేశాను. జవాబు చెప్పలేక.

''అవును. యిలా దొంగతనంగా భయపడుతూ ఏమిటి ?'' అంది.

''యిదో రకం ఆనందం అవునా ! ఆ తర్వాత వస్తుందా !''

'' అవుననుకోండి గాని నాకేమిటో ఇలా బాగుండడం లేదు. ''

''పిచ్చిదానా ! చదువు పూర్తి కాకుండా, ఎందుకని నా వూహ. అంతే కానీ, అయినా యిప్పుడేం తక్కువ మనకి ?'' అన్నాను సముదాయిస్తూ.

లత అది వినగానే ఒళ్ళోంచి పారిపోబోయింది. ఆమె పైట కొంగు పట్టుకు లాగేశాను. లత ఆగిపోయింది. వెనకాలే వున్న మంచానికి ఆనుకొని తల గడా అడ్డం పెట్టుకొని చూస్తూంది.

మెల్లిగా ఆమె భుజాలు పట్టుకున్నాను. లత ముఖం ఆవేశంతో అనేక భావాలతో నిండిపోయి వుంది. బుగ్గలు కందిపోయాయి, కళ్ళల్లో అనేక సంజ్ఞలు కనిపిస్తున్నాయి... ఆ ఎర్రటి పెదిమల మీద అమృతం ప్రవహిస్తూంది.

ఆ చక్కని అధరాలని, బుగ్గలని తొలిసారి రుచి చూశాను. దానికి చిహ్నంగా ఆమె బుగ్గల మీద కందిపోయింది; ఆమె ఎన్నోసార్లు తుడుచుకుంది గాని - ఆ మచ్చ మాత్రం పోలేదు.

ఇంతలోనే -

''లతా !'' అన్న పిలుపు వినిపించింది.

ఇద్దరం మాట్లాడే స్థితిలో లేం - కాని - లత తుమ్మెదవాలి ఎగిరిపోయిన తర్వాత అటూ ఇటూ వూగే పుష్పంలా చంచలంగా వుంది.

మళ్ళీ -

'' లతా తలుపు తియ్యి !'' అని కేక వినిపించింది. అది మా అమ్మ గొంతుకే- సందేహం లేదు!

ఇహ చూడండి మాపని దాగట్లో పడ్డ వెలంకాయ లాగయింది !

★ ★ ★

(ఆనందవాణి., 31.1.1960)